క్లుప్తంగా

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ జనార్దనరావు

గార: మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని, జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని ఎస్‌ఐ రెల్ల జనార్దనరావు అన్నారు. శనివారం సతివాడ పంచాయతీలో సంకల్పంలో భాగంగా యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు కలిగి అరెస్టులు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. డిజిటల్ అరెస్టులంటూ వస్తున్న ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని హితవుపలికారు. నగదు లావాదేవీల్లో ఇబ్బందులు వస్తే మొదటి గంటలోనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న రామారావు

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి నగరానికి చెందిన లోకనాథం రామారావు శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళంగా అందించారని జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంగుల రమణబాబు, కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న వ్యవసాయ కార్యకర్తలు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం మెట్టపేటలో రైతులకు ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ నిర్వహించారు.ఆవు పేడ, మూత్రం, నీరు, పుట్టమట్టి, బెల్లం, శనగపిండితో 200 లీటర్లు ద్రవ జీవామృతాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్యకర్త వై.చంద్రకళ మాట్లాడుతూ రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా విత్తనంనాటిన 20 రోజుల నుంచి 60 రోజుల వరకు పంటలకు ఈ ద్రవ జీవామృతం వినియోగించవచ్చునని సూచించారు. దీనివల్ల భూమికి పోషకాలు లభిస్తాయని, మెరుగైన పంటలు పండుతాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సాధికార కార్యకర్తలు మెట్ట ప్రసాద్, ధనుంజయరావు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ అభిమానుల హర్షం



మొక్కులు తీర్చుకున్న అభిమానులు

అరసవల్లి: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బెయిల్‌పై జైలు నుంచి విడుదల కావడంతో ఆయన అభిమానులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుక్కల నవీన్ ఆధ్వర్యంలో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. జాతీయ స్థాయి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్న అర్జున్‌ను అన్యాయంగా అరెస్టు చేశారని చెప్పారు. ఆయన విడుదల కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అభిమానులు గిరి, భాను, రమణారెడ్డి పాల్గొన్నారు.

నాశనం లేనిది బ్రహ్మవృక్షం



ప్రసాదరావు ను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో భాగవద్గీత సప్తాహంలో భాగంగా శనివారం 'ఊర్ధ్వమూల మథశాఖమ్' అనే అంశంపై రంగడు ప్రసాదరావు ప్రసంగించారు. నాశనం లేనిది బ్రహ్మవృక్షమన్నారు. నశించే స్వభావం కలది సంసార వృక్షమని చెప్పారు. సంసారమనే ఈ వృక్షాన్ని వైరాగ్యమనే ధృఢమైన ఆయుధంతో ఛేదించి దైవాన్ని శరణు కోరాలన్నారు. కార్యక్రమంలో మందుల మోహనరావు, గుంటుకు విశ్వేశ్వరరావు, సంగమేశ్వరరావు, నిష్టల నరసింహమూర్తి, నూక వెంకటరమణ, డి.జి.పట్నాయక్, కామేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

ధనుర్మాస వైభవం

- రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం
- 17 నుంచి తిరుప్పావై ప్రవచనాలు
- సిద్ధమవుతున్న వైష్ణవాలయాలు





నారాయణ తిరుమల ఆలయం

శ్రీకాకుళం కల్చరల్: వేదాల్లో సామవేదం.. మాసాల్లో మార్గశిరం.. అత్యంత పవిత్రమైనవని సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడే భగవద్గీతలో తెలియజేశారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన మాసంలో రంగనాథుడిని పరమభక్తితో సేవించడం ద్వారా గోదాదేవి తన భక్తిని చాటుకుంది. సూర్యుడు వృశ్చికరాశి నుంచి ధనూరాశిలోకి ఈ నెలలోనే ప్రవేశిస్తాడు. ఈ నెల రోజుల కాలాన్ని ధనుర్మాసంగా పిలుస్తూ విష్ణువును ప్రసన్నం చేసుకునేందుకు గోదామాత రోజుకో రీతిగా 'తిరుప్పావై' పాశురాలను ఆలపించడం ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. హిందువులు పవిత్రంగా ఆచరించే భగవద్గీత పుట్టింది కూడా ఈ నెలలోనే.

16న నెలగంటు..

ధనుర్మాసానికి ప్రతీకగా వైష్ణవ స్వాములు పుల్ల గుమ్మడికాయకు గంటు పెడతారు. దీని ప్రకారం ఈ నెల 16 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నెలగంటు పెట్టారంటే పండగ సీజన్ ప్రారంభమైనట్లే. అలాగే ...వలు ఆలయాల్లో ఉన్న గం...టకు పూలు కట్టి పూజలు కూడా చేస్తారు. పల్లె, పట్టణాల్లో హరిదాసుల సందడి కూడా ప్రారంభం కానుంది. సంక్రాంతి ముగ్గులతో ఇంటి పరిసరాలు శోభాయమానంగా దర్శనమిస్తాయి.

తిరుప్పావై ప్రవచనాలు..

శ్రీవైష్ణవులకు తిరుప్పావై వ్రతం ముఖ్యమైంది. ఈ నెలరోజులు రోజుకొక పాశురం చొప్పున విన్నపం చేస్తారని శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు తెలిపారు. 1 నుంచి 5 పాశురాలలో వ్రతవిధానం, 6 నుంచి 15 పాశురాలలో తోటి చెలికత్తెలను నిద్రలేపి నందగోపుని గృహానికి వెళ్లడం, 16, 17, 18 పాశురాలలో నందగోపుడు, యశోధ, బలరాములను మేల్కొల్పడం, 23వ పాశురంలో మంగళాశాసనం, 25, 26 పాశురాలలో స్వామికి అలంకారాలైన ఆయుధాలను పరా అనే వాయిద్యాన్ని తమ శరణాగతికి అనుగ్రహించి సంకల్పాన్ని నెరవేర్చమని ప్రార్థించడం, ఆఖరి రోజున గోదా రంగనాథుల కల్యాణ వేడుకలు నిర్వహించడం చేస్తామని వివరించారు.



కోదండ రామాలయం

ముస్తాబైన ఆలయాలు..

శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరాలయం, పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం, దీపామహల్ వెనుక ఉన్న శివబాలాజీ ఆలయం, పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం, చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయం, డీసీసీబీ కాలనీలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 17 నుంచి తిరుప్పావై ప్రవచనాలు ప్రారంభం కానున్నాయి. నెలరోజుల పాటు నిర్వహించే ఉత్సవాల అనంతరం గోదా రంగనాథుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

మహిమాన్వితం ధనుర్మాసం



మహిమాన్వితమైన మాసం ధనుర్మాసం. ఈ నెలలో మహావిష్ణువును తలచుకొని నెలరోజులు వ్రతం నిర్వహిస్తారు. నియమ నిష్ఠలతో కొలిస్తే కోరికలు సిద్ధిస్తాయి.

– గురుగుబెల్లి శ్రీనివాసులు, అర్చకులు, నారాయణ తిరుమల

ఎంతో పవిత్రం



పవిత్రమైన నెల ధనుర్మాసం. రోజుకొక పాశురాన్ని చదువుతాం. గోదాదేవి పాశురాలన్నీ పూర్తయ్యాక గోదా రంగనాథులకు కల్యాణ వేడుకలు నిర్వహిస్తాం.

– చామర్తి గోపాలాచార్యులు, అర్చకులు, భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, డీసీసీబీ కాలనీ

రంగనాథ స్వామికి అలంకరణ



ఫరీదుపేటలోని రంగనాథ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సేవా ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

జీవితం విలువ గుర్తించండి



జీవితం విలువ గుర్తించి ముందుకు సాగాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ అన్నారు. పొన్నాడ కేజీబీవీలో సంకల్పంలో భాగంగా క్షణికావేశంలో ఆత్మహత్యలకు దారితీస్తున్న పరిస్థితులు, సైబర్ క్రైమ్ మోసాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు అండగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సూర్యకళ, సిబ్బంది పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వెంకన్నకు విశేష పూజలు



నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పట్నాల రామకృష్ణ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



ఆరోగ్య ఉపకమిటీ సభ్యుల శిక్షణలో మాట్లాడుతున్న రేవతి

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యవసాయంలో రానున్న మూడేళ్లలో రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకంలో 80 శాతం తగ్గాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ పి.రేవతి అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో శనివారం రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ, కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ సంస్థల ఆధ్వర్యంలో ఆరోగ్యం, పోషణ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య ఉపకమిటీ సభ్యులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత యాజమాన్య పద్ధతుల్లో మార్పులు అవసరమని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం, విత్తన గుళికలు, కషాయాల వినియోగం పెరగాలని చెప్పారు. చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలన్నారు.

తూర్పుకాపు యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి



ఉద్యోగులను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

శ్రీకాకుళం/(పీఎన్‌కాలనీ): తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం చొరవ తీసుకుంటుందని సంఘ అధ్యక్షుడు సురంగి మోహనరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వశాఖల్లో తూర్పుకాపులున్నారని, వీరిని సభ్యులుగా చేర్పించే బాధ్యత సంఘ ప్రతినిధులపై ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు శివ్వాల చంద్రశేఖర్, బాడాన చిన్నారావులు రూ.50 వేలను తూర్పుకాపు భవన నిర్మాణానికి విరాళంగా అందించారు. కార్యక్రమంలోజిల్లా తూర్పుకాపు అధ్యయన వేదిక అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, కరణం చిన్న వెంకటరమణ, మక్కా శ్రీనివాసరావు, దాసరి రామచంద్రరావు, డాక్టర్ ఎం .రామజోగినాయుడు, పడాల తమ్మునాయుడు, అంకడాల తవిటన్న, కిల్లారి నారాయనరావు, వాళ్లేటి సత్యనారాయణ, వాళ్ల శ్రీరాములునాయుడు, కురిటి దుర్గారావు, పి.వసంతరావు, వాళ్ల సన్యాసినాయుడు, సురవరం పార్వతి, నడిమింటి అప్పలనాయుడు, పల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రాజెక్టు డే వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న జి.సంయుక్త. చిత్రంలో సూరిబాబు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న శర్వాణి విద్యాలయంలో శనివారం ప్రాజెక్ట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురజాడ విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి.స్వామినాయుడు కుమార్తె జి.సంయుక్త ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు వివిధ భాషల్లో వివిధ సబ్జెక్టులకు చెందిన ప్రాజెక్టులను అద్భుతంగా ప్రదర్శించారని ఆమె కొనియాడారు. తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెట్టేలా ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శర్వాణి విద్యాలయం సంస్థల అధినేత అంధవరపు సూరిబాబు, కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, డాక్టర్ కె.రేఖ, మానస, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకలకు హాజరైన క్రైస్తవులు

జిల్లా కేంద్రంలోని డగ్లస్ స్కూల్ ఆవరణలో ఉన్న కీస్టోన్ చర్చి ఆధ్వర్యంలో శనివారం యాతపేటలో స్ట్రీట్ క్రిస్మస్(సెమీ క్రిస్మస్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ జోయల్ శామ్యూల్ గోడి క్రీస్తు సందేశం వినిపించారు. అనంతరం కేక్ కట్ చేసి క్యాండిల్ లైట్ సరీ్వస్ నిర్వహించారు. కార్యక్రమంలో హోసా, లిడియాజాన్, చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిర్వాహకులు

–శ్రీకాకుళం కల్చరల్

నేడు న్యాయవాదుల వనభోజనాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పిక్నిక్ నిర్వహిస్తున్నట్టు అధ్యక్ష కార్యదర్శులు కిలారి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల మండలం కొంగరాం గ్రామానికి వెళ్లే దారిలో ఎస్టేట్ వద్ద వనభోజనం నిర్వహిస్తామని, అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాములతో అప్రమత్తం



పాముల గురించి వివరిస్తున్న గ్రీన్ మెర్సీ సంస్థ సీఈఓ రమణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: పాములతో అప్రమత్తంగా ఉండాలని గ్రీన్ మెర్సీ సంస్థ సీఈఓ రమణమూర్తి అన్నారు. పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శనివారం వివిధ రకాలైన పాములపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అన్నెపు లావణ్య, కరస్పాండెంట్ అన్నెపు రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, సౌజన్య, దేవి, దీప, కుమారి, విజయ, గ్రీన్ మెర్సీ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో పూర్వ విద్యార్థులు



ఆలయ సన్నిధిలో పూర్వ విద్యార్థులు

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని ఆంధ్రా యూనివర్సిటీ 1973–76 లా బ్యాచ్ పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. మూలవిరాట్‌కు పూజలనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్లపార్కును సందర్శించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు క్షేత్రమహత్యాన్ని వివరించారు. ఆలయ ఈవో జి.గురునాథం, అర్చకులు పాల్గొన్నారు. ఏటా 70 మంది మిత్రులంతా కలిసి ప్రముఖ క్షేత్రాలును సందర్శిస్తున్నామని దేవదాయ శాఖ విశ్రాంత అడిషనల్ కమిషనర్ జి.వి.నర్సింహమూర్తి తెలిపారు.

అప్రజాస్వామిక విధానాల వల్లే ఎన్నికలకు దూరం



మాట్లాడుతున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్

గార: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు దూరంగా ఉన్నామని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శనివారం అంపోలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు సంబంధించిన ఎన్నికలైనా అధికార దుర్వినియోగం చేస్తూ శుక్రవారం పలు జిల్లాల్లో జరిగిన సంఘటనల నేపథ్యంలో పార్టీ ఆదేశాలతో ఎన్నికల్లో పాల్గొనడం లేదన్నారు. రైతుల గుర్తింపు, నో డ్యూ సర్టిఫికెట్ అందించడంలో అధికారులను సైతం అధికార పార్టీ తమకు అనుకూలంగా మార్చుకోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రైతు పోరు కార్యక్రమం విజయవంతమైందన్నారు. విత్తనం నుంచి విపత్తు వరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నివేళలా రైతులను ఆదుకుందని, కూటమి ఏర్పడి ఏడు నెలలు పూర్తవుతున్నా అన్నదాతకు ఎటువంటి సాయం అందలేదన్నారు. ఉచిత పంటల బీమాను అటకెక్కించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతు ర్యాలీలో పాల్గొన్న నాయకులు, రైతులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండు జయరాం, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు శరీరదానం



విజయకుమారి కుటుంబసభ్యులకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

శ్రీకాకుళం: వైద్య విద్యార్థుల ప్రయోగాలకు తల్లి పార్థివదేహాన్ని దానం చేస్తూ స్ఫూర్తిగా నిలిచారు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని కుటుంబ సభ్యులు. మరణానంతరం జీవం పొందేలా మానవతా దృక్పథానికి నిదర్శనంగా నిలిచారు. నగరానికి చెందిన ఆరంగి విజయకుమారి తాను మరణించిన తర్వాత తన భౌతికదేహాన్ని ఎంబీబీయస్ విద్యార్థుల ప్రయోగాలకు అందజేయాలని 2023లో నిర్ణయించుకున్నారు. ఆమె మృతి చెందడంతో పార్థివదేహాన్ని శనివారం ఉదయం కుమారు వైద్య కళాశాలకు అప్పగించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవి వెంకటాచలం తెలిపారు. ఈ నిర్ణయం వైద్య విద్యార్థులకు ఉపయోగపడటమే కాకుండా ఇతరులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల డాక్టర్ కె.వి.రాంప్రసాద్, డాక్టర్ ఎం.హేమరాధిక, డాక్టర్ తరణి, అధ్యాపకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి ధ్రువపత్రాన్ని అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట పంచాయతీ పరిధిలోని నారాయణపురం కుడికాలువ సమీపంలో శనివారం సాయంత్రం పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. శ్రీకాకుళం నగరం, తమ్మినాయుడుపేట, ఫరీదుపేట గ్రామాలకు చెందిన 13 మంది పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.95,770 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పేకాట శిబిరాలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘాపెట్టినట్లు ఎస్సై తెలిపారు.

మైన్స్ విభాగానికి ఇసుక ట్రాక్టర్ల అప్పగింత

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట ఇసుక రీచ్ నుంచి ఇసుక తలిస్తున్న 10 ట్రాక్టర్లను గురువారం ఎచ్చెర్ల పోలీసులు స్టేషన్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అనంతరం మైన్స్ విభాగానికి అప్పగించాలని తహశీల్దార్ సింహాచలం ఎచ్చెర్ల పోలీసులకు లేఖ రాశారు. దీని ఆధారంగా ఎస్సై సందీప్‌కుమార్ శనివారం మైన్స్ విభాగానికి ట్రాక్టర్లను అప్పగించారు.

తులసిమాల అలంకరణలో..



చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అనంతరం స్వామికి పూలు, తులసిమాలలతో అలంకరించారు.

శ్రీకాకుళం కల్చరల్